సాక్షి ఆదిలాబాద్

మంగళవారం । 25 । ఏప్రిల్ । 2023



నిధుల స్వాహాపై విచారణ

గుడిహత్నూర్‌లో వీవోఏగా పనిచేస్తున్న లత రూ.20 లక్షలకు పైగా స్వాహా చేసి పరారయ్యారు. సర్పంచ్ ఫిర్యాదుతో అధికారులు విచారణ జరిపారు.

8లో▸

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. ఈనెల 30లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మే 1 నుంచి జూన్ 11 వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల వారు http// bse. telangana. gov. in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని కోరారు.

గరిష్టం/కనిష్టం 36.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య



ప్రోగ్రెస్‌కార్డు అందజేస్తున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యాబోధన చేపడుతున్నట్లు డీఈవో ప్రణీత అన్నారు. జిల్లా కేంద్రంలోని ఖానాపూర్, బాలక్‌మందిర్ ప్రాథమిక, బొక్కల్‌గూడ ప్రాథమికోన్నత పాఠశాలలను సోమవారం సందర్శించారు. చివరి పనిదినం కావడంతో జిల్లాలోని ఆయా పాఠశాలల్లో 1 నుంచి 9వ తరగతి విద్యార్థుల ఫలితాలను వారి తల్లిదండ్రుల సమక్షంలో ప్రకటించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడారు. మన ఊరు–మన బడి పథకం అమలులోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో సెక్టోరియల్‌అధికారి జె.నారాయణ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ 'స్థాయీ' సమావేశాలు వాయిదా

కైలాస్‌నగర్: ఈ నెల 27న నిర్వహించాల్సిన ఆదిలాబాద్ జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలను అనివార్య కారణాల వలన వాయిదా వేస్తున్నట్లు జెడ్పీ సీఈవో గణపతి ప్రకటనలో తెలిపారు. సమావేశాల నిర్వహణ తదుపరి తేదీలను త్వరలోనే ప్రకటిస్తామనిఆయన వెల్లడించారు.

సమ్మెలో పాల్గొంటే కఠిన చర్యలు

ఆదిలాబాద్‌టౌన్: విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్లు సమ్మెలో పాల్గొంటే సర్వీస్ నిబంధన 34 ప్రకారం కఠిన చర్యలు తప్పవని విద్యుత్ శాఖ ఎస్‌ఈ సంపత్ కుమార్ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 15న విద్యుత్ కార్మిక సంఘాలతో వేతన సవరణ ఒప్పందం ముగిసిందని పేర్కొన్నారు. అలాగే సంస్థలో సమ్మె నిషేధం ఉందని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి బాధ్యులైన వారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఏప్రిల్ 25 నుంచి సమ్మెకు పిలుపునిచ్చినట్లు మేనేజ్‌మెంట్ దృష్టికి వచ్చిందని తెలిపారు. సంస్థలో అత్యవసర సర్వీసుల చట్టం ఎస్మా అమలులో ఉందని, ఆర్టిజన్లు సమ్మెకు పిలుపునిచ్చినా చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ఏ ఒక్కరు సమ్మెలో పాల్గొనవద్దని, పాల్గొంటే సీఎండీ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తప్పవని హెచ్చరించారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో గ్రహణమొర్రితో బాధపడుతున్న వారికి ఆర్‌బీఎస్‌కే, డీఈఐసీ ద్వారా బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఔట్‌పేషెంట్ భవనంలోని రెండో అంతస్తు, 46వ గదిలో వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఏవీఆర్ ఆస్పత్రి వైద్యులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు ఉంటాయని తెలిపారు. 18 ఏళ్లలోపు వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంపీహెచ్‌డబ్ల్యూ పరీక్షలు ప్రారంభం

ఆదిలాబాద్‌టౌన్: మల్టీపర్పస్ హెల్త్‌వర్కర్ (ఎంపీహెచ్‌డబ్ల్యూ) పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని జిల్లా వైద్యారోగ్య శాఖ సమావేశ మందిరంలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్ష నిర్వహించారు. ఫస్టియర్ విద్యార్థులు 99 మందికి గాను 94 మంది, సెకండియర్‌లో 30 మందికి గాను 28 మంది హాజరయ్యారు. చీఫ్ ఎగ్జామినర్‌గా మనోహర్, ఇన్విజిలేటర్లుగా బ్రహ్మానందరెడ్డి, వెంకట్‌రెడ్డి, కిరణ్, సతీశ్ వ్యవహరించారు.

సేంద్రియ సాగుతో లాభాలు

ఆదిలాబాద్‌టౌన్: రైతులు సేంద్రియ సాగు వైపు మొగ్గు చూపాలని అగ్రికల్చర్ రిసెర్చ్ సెంటర్ శాస్త్రవేత్త శ్రీధర్ చౌహాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో సోమవారం ధరిత్రి దినోత్సవం నిర్వహించారు. మృత్తికలు, వాతావరణం, సేంద్రియ వ్యవసాయం అంశంపై సెమినార్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రసాయన ఎరువులు అధికంగా వాడడంతో భూసారం దెబ్బతిని, దిగుబడి సైతం తగ్గుతుందన్నారు. అలాగే ఆహార పదార్థాలు విషతుల్యంగా మారుతాయన్నారు. సేంద్రియ సాగు ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు గడించవచ్చని సూచించారు. వైస్‌ప్రిన్సిపాల్ జాకిర్ హుస్సేన్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



కేఆర్‌కే కాలనీలో పంపిణీకి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు

డబుల్ లెక్క తేలింది

- ద్విచక్ర వాహనం ఉన్నా అనర్హులే
- మున్సిపల్ నోటీస్‌బోర్డుపై అర్హుల జాబితా
- 26 వరకు అభ్యంతరాల స్వీకరణ
- లాటరీ ద్వారా త్వరలో లబ్ధిదారుల ఎంపిక

దరఖాస్తుల వివరాలు

మొత్తం అందిన దరఖాస్తులు	9,486
విచారణలో తేలిన అర్హులు	3,179
అనర్హులుగా నిర్ధారించిన వారి సంఖ్య	6,307
కేటాయింపునకు సిద్ధంగా ఉన్న ఇళ్లు	982



మున్సిపల్ నోటీస్‌బోర్డుపై ఉంచిన వివరాలు పరిశీలిస్తున్న దరఖాస్తుదారులు

కైలాస్‌నగర్: మున్సిపల్ పరిధిలోని నిరుపేదలను ఏడేళ్లుగా ఊరిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీకి ఎట్టకేలకు మార్గం సుగమమైంది. ఆదిలాబాద్ అర్బన్ రెవెన్యూ అధికారులు అర్హులైన వారి లెక్క తేల్చారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఈ నెల 19వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో ఇంటింటి విచారణ చేపట్టారు. ద్విచక్రవాహనం ఉన్న వారిని అనర్హులుగా ప్రకటించారు. అర్హుల జాబితాను మున్సిపల్ కార్యాలయ నోటీస్‌బోర్డుపై ప్రదర్శించారు. రెండు రోజుల పాటు ప్రజల నుంచి వీటిపై అభ్యంతరాలు స్వీకరించనున్నారు. అనంతరం తుది జాబితా సిద్ధం చేయనున్నారు. వీటి ఆధారంగా త్వరలోనే లాటరీ విధానంలో ఇళ్లను కేటాయించనున్నారు. దీంతో ఆశావాహుల్లో ఆనందం వ్యక్తమవుతుంది.

త్వరలో లబ్ధిదారుల ఎంపిక

పట్టణంలో నిర్వహించిన క్షేత్రస్థాయి విచారణ ముగియడంతో ఆదిలాబాద్ అర్బన్ రెవెన్యూ అధికారులు అర్హుల లెక్క తేల్చారు. వివరాలను ఈ నెల 21న మున్సిపల్ అధికారులకు అందజేశారు. ఆ జాబితా ప్రకారం అర్హుల పేర్లు, చిరునామా వివరాలను బల్దియా అధికారులు సోమవారం మున్సిపల్ కార్యాలయ నోటీస్‌బోర్డుపై ప్రదర్శించారు. వీటిపై అభ్యంతరాలుంటే ఈ నెల 26వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు స్వీకరించనున్నారు. ఈ జాబితాలోనూ అనర్హులున్నట్లుగా ఆధారాలు సమర్పిస్తే వారి పేర్లను తొలగిస్తారు. కాగా నిర్మించిన ఇళ్ల సంఖ్య తక్కువగా ఉండటం, అర్హుల జాబితా ఎక్కువగా ఉండటంతో లక్కీ డ్రా పద్ధతిన లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. కేటాయింపులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా ఈ విధానాన్ని అమలు చేయనున్నారు.

పంపిణీకి సిద్ధంగా 982 ఇళ్లు

పట్టణంలో లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకోసం అపార్ట్‌మెంట్ తరహాలో ఇళ్లను నిర్మించారు. స్థానిక కేఆర్‌కే కాలనీ సమీపంలో 760 ఇళ్లను నిర్మించగా , మావల సమీపంలోని సర్వేనంబర్ 170 పరిధిలో బైపాస్ జాతీయ రహదారిని ఆనుకుని 222 ఇళ్లు నిర్మించారు. కేఆర్‌కే కాలనీలోని ఇళ్లు కలరింగ్‌తో సిద్ధంగా ఉండగా మావలలోని ఇళ్లకు ఇంకా రంగులు వేయలేదు. అయితే వాటికి అమర్చిన కిటికీలు, డోర్లతో పాటు సింథటిక్ వాటర్ ట్యాంక్‌లు పూర్తిగా ధ్వంసమై అస్తవ్యస్తంగా ఉన్నాయి.

2016 నుంచి దరఖాస్తులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం నిరుపేదలు 2016 నుంచి దరఖాస్తు చేస్తూనే ఉన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణితో పాటు ఎమ్మెల్యేకు, తహసీల్దార్‌కు, ఆర్డీవోకు దరఖాస్తులు అందుతూనే ఉన్నాయి. ఇలా ఏడేళ్లుగా అందిన దరఖాస్తులను భద్రపర్చిన అధికారులు గతేడాది ఏప్రిల్ 4నుంచి 6 వరకు పట్టణంలోని వార్డుల వారీగా గ్రామసభలు నిర్వహించి వాటి వివరాలు చదివి వినిపించారు. వారు కాలనీలో ఉంటున్నారా.. లేదా, వారికి కారు, ద్విచక్ర వాహనం, సొంతిల్లు వంటివి ఉన్నాయా అనే వివరాలపై ఆరా తీశారు. వాటి ఆధారంగా అర్హులను ఎంపిక చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇంటింటికీ క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి అర్హులను ఎంపిక చేశారు.

త్వరలోనే ఇళ్ల కేటాయింపు



ఆదిలాబాద్ పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారించి అర్హులైన వారిని ఎంపిక చేశాం. వారి వివరాలను మున్సిపల్ అధికారులకు అందించగా వారు నోటీస్‌బోర్డుపై ప్రదర్శించారు. దరఖాస్తుదారులు ఈ జాబితాలను పరిశీలించి అభ్యంతరాలుంటే రెండు రోజుల్లో అందజేయవచ్చు. వాటి ఆధారంగా తుది జాబితా సిద్ధం చేస్తాం. కలెక్టర్ ఆదేశాల మేరకు త్వరలోనే ఇళ్ల పంపిణీ ప్రక్రియ నిర్వహిస్తాం. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అర్హులైన వారికి ఇళ్లు అందించేలా లక్కీ డ్రా విధానంలో పంపిణీ చేస్తాం.

– సతీశ్ కుమార్, తహసీల్దార్, ఆదిలాబాద్ అర్బన్

పల్లెకో బస్ ఆఫీసర్

- ప్రయాణికులకు మరింత చేరువగా ఆర్టీసీ
- మే 1నుంచి శ్రీకారం
- ఆయా గ్రామాల్లో ఉండే డ్రైవర్, కండక్టర్లకు బాధ్యతలు



ఆర్టీసీ బస్సు

ఆదిలాబాద్‌టౌన్: ప్రయాణికులకు మరింత చేరువయ్యేందుకు ఆర్టీసీ వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. ఇప్పటికే పండుగలు, శుభకార్యాలు, విహారయాత్రల కోసం ప్రత్యేక ఆఫర్లు ప్రకటిస్తున్న విషయం విదితమే. తాజాగా ప్రైవేట్ పోటీ నుంచి గట్టెక్కేందుకు 'ఊరుకో బస్ ఆఫీసర్'ను నియమించాలని యోచిస్తూ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మే 1 నుంచి దీనిని అమలు చేయనున్నారు. ఈమేరకు ఆ శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ఊరుకో అధికారి..

జిల్లాలో 468 జీపీలు, 556 గ్రామాలు ఉన్నాయి. రోడ్డు సౌకర్యం ఉన్న ఆయా పల్లెల మీదుగా ఆర్టీసీ ఇప్పటికే బస్సులు నడుపుతోంది. అయితే ఆదాయం పెంచేందుకు పల్లెకో బస్ ఆఫీసర్‌ను నియమించాలని సంస్థ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో నివసించే ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు, ఇతర ఉద్యోగులను విలేజ్ బస్ ఆఫీసర్‌గా నియమిస్తారు. అయితే వీరికి ఈ బాధ్యతలు అదనం. దీనికి సంబంధించి ఆర్టీసీ ఎండీ మార్గదర్శకాలు అందజేశారు. పల్లెలతో పాటు ఆయా వార్డుల్లో కూడా ఈ బస్ ఆఫీసర్లను సంబంధిత డిపో మేనేజర్లు నియమిస్తారు. గ్రామం చిన్నదిగా ఉంటే ఒకరిని, పెద్దదిగా ఉంటే మరో ఇద్దరిని నియమిస్తారు. వీరు స్వచ్ఛందంగా పనిచేయాల్సి ఉంటుంది. 15 రోజులకోసారి గ్రామంలో సమావేశాలు నిర్వహిస్తారు.

ఆర్టీసీ ప్రయోజనాలు వివరించేందుకు..

ఈ బస్ ఆఫీసర్లు ఆర్టీసీలో నూతనంగా చేపట్టే కార్యక్రమాలు, బస్ సర్వీస్ కొత్త రూట్లు, ఆయా గ్రామాల్లో రద్దీ ఎక్కువగా ఉంటే అదనంగా బస్సులు నడిపించేలా చర్యలు చేపడతారు. గ్రామానికి సంబంధించిన వారి శుభకార్యాల కోసం ముందస్తుగా బస్ బుకింగ్ చేయించడం, ఆర్టీసీలో ప్రయాణించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొస్తారు. జీపీ కార్యాలయ నోటీసు బోర్డుపై ఆర్టీసీ బస్ ఆఫీసర్ పేరు, ఫోన్ నంబర్, ఇతర వివరాలు పొందుపర్చుతారు.

ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించేలా..



ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపడుతున్నాం. ఇందులో భాగంగా ఊరుకో బస్ ఆఫీసర్ కార్యక్రమానికి సంస్థ ఎండీ శ్రీకారం చుట్టారు. మే 1 నుంచి అమలులోకి రానుంది. ఆయా గ్రామాల్లో ఉండే కండక్టర్లు, డ్రైవర్లను బస్ ఆఫీసర్‌గా నియమిస్తాం. ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని ప్రజలకు వివరిస్తాం. వారి ఆదరణను చూరగొంటాం.

– కె.జానిరెడ్డి, ఆర్టీసీ ఆర్‌ఎం, ఆదిలాబాద్

'సమరభేరి' విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న సాజిద్‌ఖాన్, మాజీ మంత్రి సీఆర్‌ఆర్

ఆదిలాబాద్‌టౌన్: ఈనెల 26న నిర్వహించనున్న నిరుద్యోగ సమరభేరి ర్యాలీని విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, మాజీ మంత్రి సి.రాంచంద్రారెడ్డి కోరారు. ఈమేరకు సోమవారం జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని స్థానిక అంబేద్కర్ చౌక్‌లో బుధవారం సమరభేరి సభతో పాటు కార్నర్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. స్వరాష్ట్రం సిద్ధించి ఏళ్లు గడుస్తున్నా సీఎం కేసీఆర్ ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శించారు. తన కుటుంబ సభ్యులకు రాజకీయ ఉద్యోగాలు మినహా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని ఎద్దేవా చేశారు. ఉమ్మడి జిల్లా పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నిజామాబాద్ డీసీసీ అధ్యక్షుడు సుభాష్ రెడ్డి, ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావ్, ఏఐసీసీ ఆదివాసీ కాంగ్రెస్ వైస్ చైర్మన్ డాక్టర్ నరేష్ జాదవ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు మల్లేష్, సుజాత, బొజ్జు పటేల్, సరస్వతి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నగేష్, బోథ్ నియోజకవర్గ నాయకులు గజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మక్కలు కొనుగోలు చేయాలని ఆందోళన

- కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

కైలాస్‌నగర్: రైతులు పండించిన మక్కలను ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న డిమాండ్ చేశారు. వేదిక ఆధ్వర్యంలో రైతులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో సుమారు 14వేల ఎకరాల్లో మక్క సాగు చేశారని, 5నుంచి 6లక్షల క్వింటాళ్ల దిగుబడి వచ్చిందన్నారు. క్వింటాల్ మక్కలకు ప్రభుత్వం రూ.1,962 మద్దతు ధర ప్రకటించిందన్నారు. దళారులు మాత్రం మారుమూల గ్రామాల రైతుల నుంచి రూ.1,400 నుంచి రూ.1500లకే కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులు పండించిన మక్కలన్నింటినీ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు రాజు, ప్రవీణ్, వెంకటరమణ, ఆశన్న, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పొచ్చర క్రాస్ రోడ్డు వద్ద..

బోథ్: మక్కలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు సోమవారం ఆందోళన చేపట్టారు. మండలంలోని పొచ్చర క్రాస్ రోడ్డు వద్ద రాస్తారోకో చేపట్టారు. వీరికి కాంగ్రెస్ నాయకులు గజేందర్ మద్దతు పలికారు.

నేటి నుంచి 'ఓపెన్' పరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్: ఓపెన్ స్కూల్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈమేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. పది పరీక్షల కోసం ఆదిలాబాద్‌లో మూడు, ఉట్నూర్‌లో ఒకటి, అలాగే ఇంటర్ పరీక్షల కోసం ఆదిలాబాద్‌లో రెండు, ఉట్నూర్‌లో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పది పరీక్షలకు 987 మంది, ఇంటర్ పరీక్షలకు 549 మంది హాజరు కానున్నారు.

ఐదు నిమిషాలు దాటితే నో ఎంట్రీ..

ఓపెన్ పది పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగనున్నాయి. పరీక్ష ప్రారంభమై 5 నిమిషాలు దాటితే కేంద్రంలోనికి అభ్యర్థులను అనుమతించేది లేదని ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ అశోక్, డీఈవో ప్రణీత తెలిపారు. విద్యార్థులు ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. అభ్యర్థులకు ఏవైనా ఇబ్బందులు ఉంటే 08732–226434, 8008403519 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'కేంద్ర, రాష్ట్ర నిధులకు తేడా తెలియని ఎమ్మెల్యే'



ప్రధాని మోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్:ఆదిలాబాద్ ఎమ్మెల్యే రామన్నకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులకు తేడా తెలవకుండా గతంలో మంత్రి ఎలా అయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లో అంతర్గత రోడ్ల విస్తరణకు రూ.40 కోట్ల నిధులు మంజూరు చేయడంతో ఆదిలాబాద్ రూరల్ మండలం లాండసాంగ్వి గ్రామంలో ప్రధాని మోదీ ఫ్లెక్సీకి సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న కనీస అవగాహన లేకుండా కేంద్రం నుంచి విడుదలైన సీఆర్‌ఐఎఫ్‌ను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసినట్లు ప్రచారం చేసుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సంతోష్, ఆదినాథ్, రవి, ప్రవీణ్, రత్నాకర్ రెడ్డి, జ్యోతి, కిష్టు తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదాలపై కోర్టును ఆశ్రయించాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

కైలాస్‌నగర్: ప్రైవేట్ పట్టా భూములకు సంబంధించిన వివాదాలుంటే కోర్టును ఆశ్రయించాలని, అలాంటి వాటిపై తామేమి చేయలేమని కలెక్టర్ రాహుల్ రాజ్ స్పష్టం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందజేస్తూ సత్వరం పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ సంబంధిత వివాదాలపై పలువురు కలెక్టర్‌కు విన్నవించగా కోర్టును ఆశ్రయించాలని సూచించారు. వ్యక్తిగత, కుటుంబ విభేదాలుంటే వాటిపై పోలీసులను ఆశ్రయించాలే తప్ప తామేమి చేయలేమని, తమకు పరిమితులుంటాయని పేర్కొన్నారు. శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి ఎప్పటికప్పుడు వాటి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రిజ్వాన్, ఎస్.నటరాజ్, ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ పి.శ్రీజ, ఆర్డీవో రమేశ్ రాథోడ్ పాల్గొన్నారు.

రాత్రి బడిని విజయవంతం చేయాలి

గిరిజనులను అక్షరాస్యులుగా మార్చేందుకు చేపట్టిన రాత్రి బడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ పిలుపునిచ్చారు. జిల్లాలో ఎంపిక చేసిన 46గిరిజన గ్రామాల్లో ఈకార్యక్రమం అమలు చేసేలా పంచాయతీ కార్యదర్శులు,ఐకేపీ ఏపీఎంలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలకు స్థానిక టీటీడీసీలో వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజతో కలిసి 'రాత్రి బడి' ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందని తెలిపారు. గిరిజనులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించడంతో పాటు తాము సైతం అక్షరాస్యులుగా మారాలని సూచించారు. రాయడం, చదవడంతో పాటు చిన్నపాటి లెక్కలు చేసేలా ఇందులో బోధించనున్నట్లు వివరించారు.కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, డీడబ్ల్యూవో మిల్కా, వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

నెల రోజుల్లో 'కమాండ్ కంట్రోల్' పూర్తి

- అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా
- రెండో పోలీస్ బెటాలియన్ సందర్శన



మొక్క నాటుతున్న అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని యాపల్‌గూడలో గల రెండో పోలీస్ బెటాలియన్‌లో కమాండ్ కంట్రోల్ ఏర్పాటు పనులు నెల రోజుల్లో పూర్తి కానున్నాయని తెలంగాణ పోలీస్ బెటాలియన్ అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా అన్నారు. బెటాలియన్‌ను సోమవారం సందర్శించిన ఆమె కొత్తగా ఏర్పాటు చేసిన స్వాగత తోరణంతో పాటు ప్రత్యేక బ్యారక్‌లను ప్రారంభించారు. వసతులు, భవనాలను పరిశీలించారు. కమాండెంట్ వేణుగోపాల్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. యాపల్‌గూడలో 120 ఎకరాల్లో రెండో బెటాలియన్ ఏర్పాటు చేశామన్నారు. ఇందులో దశల వారీగా అన్ని వసతులను సమకూరుస్తున్నట్లుగా తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్ నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తుండగా తాజాగా బెటాలియన్ నిర్వహణ అంతటిని యాపల్‌గూడకు మార్చినట్లు తెలిపారు. ముందుగా అధికారులు, సిబ్బంది నుంచి ఆమె గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆవరణలో మొక్క నాటారు. అనంతరం అడిషనల్ డీజీపీని కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ రిజ్వాన్, ట్రెయినీ కలెక్టర్ పి.శ్రీజ మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, అడిషనల్ కమాండెంట్ ఎం.జయరాజ్, డీఎస్పీ ఉమేందర్, రూరల్ సీఐ రఘుపతి, ఎస్సై నాగ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

భూమిని తీసుకుని ఉపాధి మరిచారు..

బెటాలియన్ ఏర్పాటు కోసం తమ భూమిని తీసుకున్న ప్రభుత్వం తమ కుటుంబంలో మాత్రం ఎవరికి ఉపాధి కల్పించలేదని యాపల్‌గూడకు చెందిన కట్టా రాజేశ్వర్ కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. విషయాన్ని గతంలో కలెక్టర్ దృష్టికి సైతం తీసుకెళ్లామన్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. అడిషనల్ డీజీపీని కలిసేందుకు బెటాలియన్ వద్దకు రాగా లోపలకు వెళ్లేందుకు సిబ్బంది అనుమతించలేదు.

బావుల కింద.. సిరుల పంట



బోరిగాంలోని వ్యవసాయ బావి



సాగవుతున్న వరి పంట

- బోరిగాంలో ఊటబావుల ఆధారంగా వ్యవసాయం
- రెండు పంటలకు నీరు పుష్కలం
- వేసవిలోనూ బావుల్లో జలకళ
- బోరు వద్దని రైతులందరి తీర్మానం

లక్ష్మణచాంద: సాధారణంగా ఏ ఊరు..ఏ పంట చేలకు వెళ్లినా..బోరుబావుల ద్వారా సాగు చేయడం చూస్తుంటాం. నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం బోరిగాంలో మాత్రం ఏ చేన్లలో ఎక్కడ చూసిన ఊటబావులే దర్శనమిస్తాయి. రెండు కాలాలు ఊట బావుల్లో నీళ్లు ఊరుతూనే ఉంటాయి. ఎప్పుడు చూసిన పంటలు కళకళలాడుతున్నాయి. ఈ బావుల ద్వారా రైతులు వివిధ పంటలు సాగుచేసి ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఊటబావుల–వ్యవసాయ గ్రామంగా జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన బోరిగాంపై ప్రత్యేక కథనం.

చెరువుల్లో నీరు పుష్కలం

బోరిగాం గ్రామంలో పెద్ద చెరువు, చిన్న చెరువు, ఎర్రకుంట వంటి మూడు చెరువులు ఉన్నాయి. ఈ చెరువులే గ్రామంలో ఊటబావులకు అండగా ఉంటున్నాయి. గ్రామానికి ఓ వైపు కొండ ప్రాంతం ఉండటంతో వర్షాకాలంలో వాటిపై నుంచి వచ్చేనీరు చెరువుల్లో చేరుతుంది. చెరువుల్లో నీరు ఎప్పుడు పుష్కలంగా ఉండటంతో భూగర్భ జలాలు అడగంటకుండా ఉంటున్నాయి. ఊటలకు ఇవే కారణమని గ్రామస్తులు చెబుతున్నారు.

తీర్మానానికి కట్టుబడి..

పంటలకు నీరందించేందుకు ఇతర గ్రామాల రైతులు బోరు వేసినా నీరు సరిగ్గా రావడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో బోరిగాంలో భూగర్భ జలాలు కాపాడుకోవడం కోసం రైతులందరూ ఏకతాటిపై ఉండి బోరుబావులు వద్దని తీర్మానం చేసుకున్నారు. 30 ఏళ్ల కిందట తీర్మానానికి ఇప్పటికి కట్టుబడి ఉన్నారు. గత 25–30 ఏళ్ల నుంచి చేన్లలో తవ్వించిన బావుల ద్వారానే రెండుకాలాల్లో రెండు పంటలు సాగు చేస్తున్నారు.

భూగర్భ జలాలు పుష్కలం

మండలంలోని ఇతర గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. రైతులు తమ చేన్లల్లో 150 ఫీట్లు తవ్వించిన తర్వాతనే నీళ్లు వస్తున్నాయి. బోరిగాంలో భూగర్భ జలాలు పై పైననే ఉన్నాయి. 8 నుంచి 10 గజాలు (40–50 ఫీట్లు)తవ్వించిన బావుల్లో భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్నాయి. ఇదంతా కేవలం బోరుబావులు లేకపోవడం వల్లనే సాధ్యమైతుందని రైతులు అంటున్నారు. వేసవిలో ఏ ఒక్క బావి ఎండిపోదని చెబుతున్నారు.

పంటలు సాగు..

బోరిగాం గ్రామంలో వానాకాలంలో 325 ఎకరాలు పత్తి, 60 ఎకరాలు పసుపు, ఐదెకరాలు సోయా, 32 ఎకరాలు కందులు, 231 ఎకరాల్లో వరి పంటలను రైతులు సాగు చేశారు. ప్రస్తుతం రెండవ పంటగా గోధుమ, వరి, మొక్కజొన్న, నువ్వుల తోపాటు కూరగాయలు సాగు చేస్తున్నారు. అయినా తమకు నీటితో ఎటువంటి ఇబ్బంది లేదని రైతులు అంటున్నారు.

బోరిగాం గ్రామ వివరాలు

మొత్తం జనాభా	1218
కుటుంబాలు	398
రైతులు	302
బావులు	150-200
సాగు విస్తీర్ణం	594 ఎకరాలు



తీర్మానానికి కట్టుబడి..



గ్రామంలోని రైతులు తీర్మానానికి కట్టుబడి ఉండటంతో వ్యవసాయ చేనుల్లో ఒక్క బోరు వేయలేదు. ఏళ్ల క్రితం తవ్వించిన బావుల్లో ఎప్పటికి నీరు పుష్కలంగా నీరు ఉంటుంది.

– బొంగురాల అమరేశ్వర్, రైతు, బోరిగాం

బావులు తవ్వించాం



గ్రామంలో 8 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. తాము మూడు బావులు తవ్వించాం. బావుల ద్వారానే మొక్కజొన్న, వరి, నువ్వు పంటలు సాగు చేస్తున్నాం.

– మల్లయ్య, యువ రైతు, బోరిగాం

పుష్కలంగా నీరు



గ్రామంలో రెండు పంటలు బావుల ద్వారానే సాగు చేస్తున్నాం. వేసవిలో నీటి సమస్య ఉండదు. ప్రస్తుతం బావుల్లో నీరు నిండుగా ఉన్నాయి.

– పాటిల్ గంగాధర్, యువ రైతు, బోరిగాం

క్లుప్తంగా

250 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యం లారీతో అధికారులు

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి గ్రామంలోని చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం రాత్రి 250 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై ఆర్.శంకర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి లారీలో బియ్యాన్ని తరలిస్తున్నారు. బాదనకుర్తి చెక్‌పోస్ట్ వద్ద స్పెషల్ బ్రాంచ్ పోలీసుల తనిఖీల్లో బియ్యం పట్టుబడింది. లారీతో సహా 250 క్వింటాళ్ల బియ్యం సీజ్ చేసి డీసీఎస్‌వో తనూజకు అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని డీసీఎస్‌వో తెలిపారు. కాగా, పట్టుకున్న బియ్యం బిహార్ నుంచి నాలుగు రాష్ట్రాల మీదుగా వచ్చినా ఎక్కడా ఎలాంటి స్టాంపింగ్ లేదని తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యాన్ని ఎవరైన తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాసర ఆర్జీయూకేటీలో కార్మికుల తొలగింపు!

భైంసా: బాసర ఆర్జీయూకేటీలో పనిచేస్తున్న ఐదుగురు పారిశుధ్య కార్మికులను విధుల నుంచి తొలగించారు. ఫస్ట్ మాన్ మేనేజ్‌మెంట్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ థర్డ్ పార్టీ తరపున పనిచేస్తున్న ఈ కార్మికులు వర్సిటీలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, ఈ మేరకు వారిని తాత్కాలికంగా విధుల నుంచి తొలగించినట్లు వర్సిటీ డైరెక్టర్ సతీశ్‌కుమార్ తెలిపారు. కార్మికులకు చెల్లించాల్సిన పీఎఫ్, ఈఎస్‌ఐ అమలులో ఏమైనా సమస్యలుంటే ఏజెన్సీ ప్రతినిధులతో మాట్లాడి పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

ట్రిపుల్‌ఐటీ కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ ప్రధాన ద్వారం వద్ద సోమవారం పారిశుధ్య కార్మికులు నిరసన చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే వేతనాలు ఇప్పించాలని బీజేపీ అధ్యక్షుడు జిడ్డు సుభాష్ డిమాండ్ చేశారు.

పాల ట్యాంకర్ బోల్తా



బోల్తాపడిన పాల ట్యాంకర్

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని 44వ జాతీయ రహదారిపై సోమవారం పాల ట్యాంకర్ బోల్తాపడింది. వేలాది లీటర్ల పాలు రోడ్డు పాలయ్యాయి. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ నుంచి పాల లోడుతో మహారాష్ట్రలోని ఘడ్‌చందాకు వెళ్తోంది. ఈ క్రమంలో 44వ జాతీయ రహదారిపై ముందు ఉన్న లారీ సడెన్‌గా బ్రేక్ వేయడంతో పాల ట్యాంకర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్ మలకప్ప క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. రెండు కాళ్లు విరిగిపోవడంతో ఆయన్ని బయటకు తీసేందుకు స్థానికులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. చివరకు జేసీబీతో ఆయన్ను బయటకు తీసి రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

కూచిపూడిలో జిల్లా కళాకారుల ప్రతిభ



అవార్డు తో దీక్షిత రెడ్డి, ఆధ్యారెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: కీర్తి ఆర్ట్స్ చారిటబుల్ ట్రస్ట్, కీర్తి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి, జాతీయ నృత్య దినోత్సవ సందర్భంగా హైదరాబాదులోని రవీంద్రభారతిలో సోమవారం కూచిపూడి నృత్యోత్సవం నిర్వహించారు. నిర్మల్‌కు చెందిన దీక్షితరెడ్డి, ఆద్యారెడ్డి, తేజస్విని, సుదీక్ష నృత్యం ఆహుతులను అలరించాయి. మాజీ జడ్జి బూరుగుల మధుసూదన్, మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, ఫిలిం యాక్టర్ బాబ్జి, దైవాజ్ఞ శర్మ చేతుల మీదుగా వీరికి ప్రశంసాపత్రం మెమొంటో గోల్డ్ మెడల్ అందించారు.

ఆకట్టుకున్న చిన్నారి నృత్య ప్రదర్శన

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె గ్రామానికి చెందిన బలాష్టు శివరామకృష్ణ–సోనీ దంపతుల కూతురు శాన్విక కూచిపూడి నృత్యప్రదర్శనలో రాణించింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సోమవారం నిర్వహించిన ''డ్యాన్స్ ఎక్స్‌లెన్సీ అవార్డు–2023'' కూచిపూడి నృత్యప్రదర్శనలో ప్రతిభ చాటింది. కార్యక్రమ నిర్వాహకులు గోల్డ్‌మెడల్‌తోపాటు ప్రశంస పత్రాన్ని అందజేశారు. దైవజ్ఞశర్మ, మధుసూదన్, నృత్య శిక్షకురాలు నవ్యవిజయ్ చిన్నారిని అభినందించారు.



చిన్నారికి ప్రశంసపత్రం, జ్ఞాపిక అందజేస్తున్న నిర్వాహకులు

ఉద్యోగులకు ట్రెజరీ ద్వారా వేతనాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ట్రెజరీ ద్వారా జీతాలు అందజేయాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులకు హెల్త్‌కార్డులు అందజేయాలని, 317 జీవో అమలు చేసి అర్హులైన వారిని బదిలీలు చేయాలన్నారు. అర్హులైన హెడ్ నర్సులకు నర్సింగ్ సూపరింటెండెంట్లుగా, నర్సింగ్ సిబ్బందికి హెడ్ నర్సులుగా పదోన్నతి కల్పించాలన్నారు. గ్రేడ్ వన్ ఫార్మసిస్టులకు ఫార్మసిస్ట్ సూపర్‌వైజర్లుగా, రేడియోగ్రాఫర్లకు చీఫ్ రేడియోగ్రాఫర్లుగా ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న నాలుగో తరగతి ఉద్యోగుల పోస్టులు వెంటనే భర్తీ చేయాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలన్నారు.

జిల్లా కార్యవర్గం..

తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా శోభ (హెడ్‌నర్స్), ప్రధాన కార్యదర్శిగా స్వరూప (స్టాఫ్‌నర్స్), కోశాధికారిగా గురిజాల వనిత (స్టాఫ్‌నర్స్), ఉపాధ్యక్షులుగా వీణ, కళారాణి, రమ్య, సహ కార్యదర్శులుగా విజయ, సరస్వతి, రేచల్, సుజాత, కార్యవర్గ సభ్యులుగా తహేరా, లీనా, ప్రియాంక ఎన్నికయ్యారు.

స్నానానికి వెళ్లి..అనంతలోకాలకు

- చెక్‌డ్యామ్‌లో నీటమునిగి బాలుడి మృతి



హరీశ్ (ఫైల్)




హరీశ్ మృతదేహం

నేరడిగొండ: వేసవి సెలవులు కావడంతో స్నేహితులతో కలిసి గ్రామంలోని ఊరి చివరన ఉన్న చెక్‌డ్యామ్‌లో స్నానానికి వెళ్లిన ఓ బాలుడు అనంతలోకాలకు వెళ్లిపోయాడు. మండలంలోని తర్నం(కె) గ్రామంలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దుర్గం హరీశ్ (14) ఇటీవల 8వ తరగతి పరీక్షలు రాశాడు. వేసవి సెలవుల్లో సరదాగా తన స్నేహితులు దుర్గం రమాసాగర్, విజయ్‌కాంత్‌తో కలిసి చెక్‌డ్యామ్‌లో స్నానానికి వెళ్లాడు. నీటి లోతు ఏర్పడకపోవడంతో హరీశ్ నీటిలో మునిగాడు. స్నేహితులు గ్రామానికి చేరుకుని తండ్రికి సమాచారం అందించారు. దీంతో తండ్రితో పాటు గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారు. హరీశ్‌ను బయటికి తీశా రు. కొన ఊపిరితో ఉండడంతో 108 అంబులెన్స్‌లో బోథ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందాడని వైద్యుడు తెలపడంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. ఉన్నత చదువులు చదివి భవిష్యత్తులో ఎదుగుతాడన్న కన్నకొడుకు తమ కళ్లముందే మృతిచెందడాన్ని జీర్ణించుకోలేకపోయారు. బాలుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై మారుతి తెలిపారు.

నిధుల స్వాహాపై అధికారుల విచారణ

- రూ.20 లక్షలతో ఉడాయించిన ఐకేపీ వీవోఏ
- గతనెలలో ఫిర్యాదు చేసిన సర్పంచ్

గుడిహత్నూర్: మండల కేంద్రంలో జైగణేశ్ గ్రామైఖ్య సంఘానికి చెందిన 26 స్వయం సహాయక సంఘాలకు వీవోఏగా పని చేస్తున్న లత నమ్మకంగా ఉంటూ ఏకంగా రూ.20 లక్షల పైగా స్వాహా చేసి పరారైంది. గతంలో ఈ విషయాన్ని గుర్తించిన సంఘ సభ్యులు కొందరు స్థానిక సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. గత 4న జరిగిన సమావేశంలో సర్పంచ్ సునీతా జాదవ్ అధికారులు దృష్టికి తీసుకెళ్లింది. గత 15 రోజుల నుంచి లత పరారీలో ఉంది. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో డీపీఎం హేమలత విచారణ చేపట్టారు. స్త్రీనిధి రుణాలు ఎక్కువ మొత్తంలో లత నిధులు స్వాహా చేసినట్లు తేలింది. బ్యాంకు లింకేజీ ద్వారా తీసుకున్న రుణాలు చెల్లించడానికి సంఘాల సభ్యులు లతకు రూ.9 లక్షలను బ్యాంకులో కట్టలేదని విచారణలో తేలింది. అధికారులు ఆమె భర్త చందును విచారించారు. పరారీలో ఉన్న లతను పిలిపించాలని కోరారు. మా మధ్య గొడవలున్నాయని రెండు నెలలుగా ఆమెతో నేను లేనని, వారంలో లతను మీ ముందుకు తీసుకువస్తానని హామీఇచ్చాడు. దీంతో విచారణను వారంపాటు వాయిదా వేశారు.



వాడుకున్న డబ్బులు తిరిగి చెల్లిస్తానని వీవోఏ రాసి ఇచ్చిన పత్రం

స్త్రీనిధి రుణాల్లో అవకతవకలు..

జిల్లా వ్యాప్తంగా స్త్రీ నిధి రుణాల మంజూరు నుంచి చెల్లింపు వరకు అవకతవకలు జరుగుతున్నాయి. వీవోఏగా పని చేస్తున్న లత ఆయా సంఘాల సభ్యులకు నమ్మకంగా మెదిలింది. వారికి తెలియకుండానే రుణాలు మంజూరు చేసుకుని తన ఖాతాలో మళ్లించుకున్నట్లు తెలుస్తోంది. ఇదే క్రమంలో రూ.50 వేలు అవసరమని దరఖాస్తు పెట్టుకున్న సభ్యులకు తెలియకుండానే రూ. లక్ష పైగా మంజూరు చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో పాటు వారికి రుణాలు చెల్లిస్తూ ఎన్‌పీఏ రాకుండా జాగ్రత్త పడినట్లు గుర్తించారు. ఇలా మొత్తం రూ.20 లక్షల పైచిలుకు స్వాహా చేసింది. వీరి సంఘంలో ఉన్న సర్పంచ్ జాదవ్ సునీతా సైతం మోసపోవడంతో ఈ విషయం వెలుగు చూసింది. కాగా రుణాల మంజూరు, చెల్లింపుల్లో ఐకేపీ సీసీలకు సమాచారం ఉండకపోవడంతో వీవోఏలు అవకతవకలు పాల్పడుతున్నట్లు స్పష్టమవుతోంది. అయినా సంబంధిత అధికారులు చోద్యం చూస్తుండడంతో వీరి ప్రమేయం ఉందని బాధిత సంఘాల మహిళలు ఆరోపిస్తున్నారు. ఈ అవకతవకలను గుర్తించిన స్థానిక అధికారులు కొంత సొమ్మును వారి ద్వారా తిరిగి చెల్లిస్తామనే పత్రాలు రాసుకోవడం చర్చాంశనీయంగా మారింది. దీనిపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరుతున్నారు. విచారణ చేపట్టిన వారిలో సీబీవో ఆడిటర్లు గంగాధర్, శ్రీనివాస్, రాజేందర్, ఏపీవో భగవాండ్లు ఉన్నారు. స్థానిక సర్పంచ్ జాదవ్ సునీతా రమేశ్, జెడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్, ఉప సర్పంచ్ గజానంద్ పాల్గొన్నారు.

సూపర్‌మార్కెట్‌లో అగ్ని ప్రమాదం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బస్‌డిపో ఎదురుగా కాంప్లెక్స్‌లో గల మోర్ సూపర్ మార్కెట్‌లో సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. కాంప్లెక్స్ సెల్లార్‌లోని విద్యుత్ మీటర్ల నుంచి మంటలు రావడంతో ఫైర్‌సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేసి అదుపులో తెచ్చారు. ఈ ప్రమాదంలో సు మారు లక్ష ఆస్తి నష్టం వాటిల్లిందని సిబ్బంది తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని గాజులపేట్ కాలనీలో సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. స్థానికుల వివరాల ప్రకారం..పరస భీమేశ్ సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. ఆ సమయ ంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి ఫైర్ సిబ్బందికి సమాచారం అందజేశారు. అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలార్పారు. అప్పటికే ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. సామగ్రి కాలిపోయింది. సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు భీమేశ్ తెలిపాడు.

అడవిపంది దాడిలో ఒకరికి గాయాలు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని వాన్‌వాట్‌కు చెందిన మోతిరామ్ అడవి పంది దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామ సమీపంలో నర్సరీ వద్ద సోమవారం పనులు చేస్తుండగా అడవి పంది దాడి చేయడంతో మోతిరామ్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడికి చేరుకుని అతనికి ప్రథమ చికిత్స చేసి రిమ్స్‌కు తరలించారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ఉట్నూర్‌రూరల్: గిరిజన అర్జీలు సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు, డీడీ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గిరిజనుల నుంచి అర్జీలను వారు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల అర్జీలను శాఖల అధికారులు పరిశీలించి న్యాయం చేస్తారన్నారు. ఓఎస్డీ కిష్టయ్య, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, ఏవో రాంబాబు, జేడీఎం నాగభూషణ్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్, ఐటీడీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టా ఇప్పించాలని బేల మండలం సైద్‌పూర్‌కు చెందిన పెందూర్ గంగుబాయి కోరాడు.
- కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని ఉట్నూర్ మండలం జెండగూడ గ్రామానికి చెందిన ఆత్రం భగవంత్‌రావు అర్జీ అందించాడు. అదేవిధంగా గిరి వికాసం పథకం కింద త్రీఫేజ్ విద్యుత్ లైన్ మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు.
- కోళ్లఫారం మంజూరు చేయాలని ఉట్నూర్ మండలం తేజనాయక్ తండాకు చెందిన రాథోడ్ రామారావు విన్నవించాడు.

గోడు వినేవారేరి?



గూడు కోసం తన గోడు వినిపించేందుకు ఓ దివ్యాంగ వృద్ధురాలు సోమవారం నిర్మల్ కలెక్టరేట్‌కు వచ్చింది. లక్ష్మి ప్రమాదవశాత్తు రెండు కళ్లు పనిచేయకపోవడంతో కాళ్లపై పాకుతూ భిక్షాటన చేసుకుంటూ కాలం వెళ్లదీస్తోంది. తనకు డబుల్ బెడ్రూం ఇప్పించాలని కలెక్టర్‌కు మొరపెట్టుకున్నా ఇప్పటివరకు ఎవరు స్పందించలేదని వాపోయింది. కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

ఫైన్ పడకుండా..





ట్రాఫిక్ పోలీసుల తనిఖీల నేపథ్యంలో చలాన్ల బాధ నుంచి తప్పించుకునేందుకు ద్విచక్ర వాహనదారులు కవర్ చేస్తున్నారు. వాహన నంబర్ ప్లేట్లు కనిపించకుండా బట్టలు కప్పడంతోపాటు రేడియం స్టిక్కర్లను అతికించడం, ఓ నంబర్‌ను తొలగించడం చేస్తూ జరిమానా నుంచి తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

విద్యుత్ సిబ్బందిపై దాడి కేసులో ముగ్గురికి జైలు

నిర్మల్‌టౌన్: విద్యుత్ సిబ్బందిపై దాడి కేసులో ముగ్గురికి రెండు నెలల జైలు శిక్షతోపాటు, ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధిస్తూ నిర్మల్ ప్రథమ న్యాయమూర్తి ఆర్.అజయ్‌కుమార్ సోమవారం తీర్పునిచ్చారు. కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం..నిర్మల్‌రూరల్ మండలం రత్నాపూర్‌కు చెందిన లైన్‌మెన్ కర్నాల సంతోష్ గ్రామంలో పెండింగ్ విద్యుత్ బకాయిల వసూళ్లు చేస్తున్నారు. మహిళలు ఉన్న ఒక ఇంట్లో పెండింగ్ బిల్లు రూ.20,500 ఉంది. మహిళలను బిల్లు అడిగినందుకు సిబ్బంది కర్నాల సంతోష్, ప్రభాకర్‌పై అదే గ్రామానికి చెందిన షేక్ ఇర్ఫాన్, షేక్ ఇమ్రాన్, షేక్ ముజాహిద్ దాడి చేశారు. నిర్మల్‌రూరల్ పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై రమణమూర్తి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో హాజరుపర్చారు. పీపీ రామకృష్ణ 11 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేయడంతో న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

పిడుగుపాటుకు పశువులు మృతి



జైనథ్: మండలంలోని ఫౌజ్‌పూర్ గ్రామంలో మూడు పశువులు పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. బాధిత రైతులు తోట రాజు, తోట అనిల్, కట్కూర్ల నరేశ్ కథనం ప్రకారం.. సోమవారం సాయంత్రం వర్షం మొదలవడంతో మేతకు వెళ్లిన పశువులు చెట్టు కింద సేదతీరుతుండగా ఒక్కసారిగా పిడుగుపడి అక్కడికక్కడే మృతిచెందాయి. ప్రభుత్వం ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు.